క్లుప్తంగా

శ్రీవారి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, ఆలయ ధర్మకర్తలు

కొడంగల్ రూరల్: మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామివారి ఆలయ క్యాలెండర్‌ను శనివారం శ్రీస్వామివారి సన్నిధిలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, ఆలయ పండితుడు శ్రీమాన్ ధరూర్ శ్రీనివాసాచార్యులు, ధర్మకర్తలు, అర్చకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగానే ఇక్కడ స్వామివారి కైంకర్యాలు నిర్వహించడం ఈ ప్రాంత వాసులకు అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. రెండో తిరుపతిగా పేరుగాంచిన ఆలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, శ్రీవారిని దర్శించుకోవడం మహాభాగ్యమన్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

కొడంగల్ రూరల్: క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రభుత్వం తరఫున క్రైస్తవులకు శనివారం అధికారులు, నాయకులు దుస్తులను పంపిణీ చేశారు. స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిధిలోని సుమారు 7వేల మందికి దుస్తులు అందజేసినట్లు తహసీల్దార్ విజయకుమార్ తెలిపారు. క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, నాయకులు ప్రశాంత్, నియోజకవర్గ నోడల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషిచేస్తే గుర్తింపు



ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్యను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

కుల్కచర్ల: విద్యార్థుల ఉన్నతికి కృషిచేసే గురువులు ఎక్కడికి వెళ్లినా తగిన గుర్తింపు దక్కుతుందని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బస్వరాజులు అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన వెంకటయ్య.. మొయినాబాద్ మండలం చిన్న మంగళారం గ్రామానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి దేవి, ఉపాధ్యాయుడు చందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట పసుపు, నిమ్మకాయలు

భయాందోళనలో విద్యార్థులు



పాఠశాల ఎదుట పసుపు, కుంకుమ మధ్య నిమ్మ, గుమ్మడి కాయలు

యాలాల: సైన్స్ అభివృద్ధి చెంది మనుషులు అంతరిక్షంలో ప్రవేశించినా, సాంకేతికతను అందిపుచ్చుకుని అభివృద్ధిలో దూసుకుపోతున్నా.. కొంతమంది ఇంకా మూఢ విశ్వాసాల్లోనే మగ్గుతున్నారు. యాలాల మండలం గోరేపల్లి ప్రాథమిక పాఠశాల ప్రవేశ మార్గం ఎదుట శనివారం ఉదయాన్నే కేసేసిన నిమ్మకాయలు, గుమ్మడి కాయలు కనిపించాయి. వీటిపై పసుపు, కుంకుమ చల్లి ఉండటంతో స్కూల్‌కు వెళ్లిన విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. మధ్యాహ్నం వరకు అలాగే ఉన్నా.. పంచాయతీ అధికారులు, పాలకులు పట్టించుకోలేదని స్థానిక యువకులు మండిపడ్డారు. అనంతరం నిమ్మకాయలకు నిప్పుపెట్టి రోడ్డు పక్కన పడేశారు.

రథోత్సవాన్ని విజయవంతం చేయాలి

దోమ: సంజీవస్వామి రథోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త ప్రార్థసారథి శనివారం ఒక ప్రకటనలో కోరారు. దోమ మండలం దొంగ ఎన్కేపల్లిలో నేటి నుంచి 27 వరకు జరిగే వేడుక జరగనుందని తెలిపారు.



తాండూరు రూరల్: చంద్రగిరిలో భక్తుల రద్దీ



తాండూరు రూరల్: స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



కొడంగల్ రూరల్: భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు

గోవిందా.. గోవిందా

- వైభవోపేతంగా వైకుంఠ ఏకాదశి
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని జిల్లాలోని ఆలయాలు, పరిసర ప్రాంతాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తజనం వేకువ జామునుంచే దేవాలయాలకు బారులు తీరగా.. ఉదయం 6గంటలకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం భక్తులు దేవతా మూర్తులకు పూజలు చేశారు. మంగళహారతులు ఇచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు.

కొడంగల్ రూరల్/తాండూరు రూరల్/పరిగి: రెండో తిరుపతిగా పేరుగాంచిన శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరుడిని వజ్ర, వైడుర్యాలు, పూలమాలలతో అలంకరించి, ఉదయం 6గంటలకు ఉత్తర వైకుంఠ ద్వార భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. దర్శనం తరువాత భక్తులు స్వామివారికి మహా మంగళహారతులు పట్టారు. ప్రత్యేక అలంకరణలతో శ్రీవారిని మాడ వీధులలో ఉత్సవ ఊరేగింపు నిర్వహించారు. ఇదిలా ఉండగా.. ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకుంటే మహా విష్ణువును దర్శనం చేసుకున్న పుణ్యం లభిస్తుందని, అనేక శుభాలు కలుగుతాయని, పురాణ హితోక్తి అని పురోహితులు వివరించారు. ధనుర్మాసం సందర్భంగా వేద పండితులు శ్రీమాన్ ధరూర్ శ్రీనివాసాచార్యులు తిరుప్పావై పారాయణం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



తాండూరు రూరల్: చంద్రగిరి శ్రీదేవి భూదేవి వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తదితరులు

చంద్రగిరిలో..

వైకుంఠ ఏకాదశి సందర్భంగా తాండూరు మండలం అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్(చంద్రగిరి)లోని శ్రీ దేవి భూదేవి వేంకటేశ్వర స్వామి ఆలయం గోవింద నామస్మరణతో మారుమోగింది. ఈ సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వారా స్వామివారి దర్శనం కల్పించారు. స్వామి వారికి ఉదయం మేలు కోలుపు అనంతరం విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఆలయ ధర్మకర్తలు వెంకటాచార్ శుక్రవార్, పురంధరాచార్ శుక్రవార్, రాఘవచార్ శుక్రవార్, బాలాజీ బ్రదర్స్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

భువికి.. ముక్కోటి దేవతలు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా పరిగి పట్టణంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. మూడు కోట్ల మంది దేవతలు భూలోకానికి వచ్చి, ఏకాదశిన మహావిష్ణువును పూజిస్తారని పురాణాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా ఉత్తర ద్వారం గుండా విష్ణుమూర్తిని దర్శించుకుంటే సకల భాగ్యం దక్కుతుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు భక్తజనం అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఇందులో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: మాడ వీధులలో స్వామివారి ఉత్సవ ఊరేగింపు



పరిగి: శ్రీవారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్ అశోక్, జెడ్పీటీసీ హరిప్రియ తదితరులు



పరిగి: వేంకటేశ్వరుడి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు



వికారాబాద్: వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు



వికారాబాద్: గీతా పారాయణంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు



దోమ: భక్తులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ



తిరుమల శ్రీనివాసుడి సన్నిధిలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కుటుంబీకులు

వంట గ్యాస్ ఈకేవైసీ గడువు పొడిగింపు

యాలాల: వంట గ్యాస్ లబ్ధిదారులకు ఈకేవైసీ గడువును కేంద్రం 2024 మార్చి 31వరకు పొడిగించినట్లు స్థానిక సాయి తిరుమల భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు చంద్రకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈకేవైసీ విషయంలో లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని, గడువు పెంచిన విషయాన్ని గ్రహించాలని సూచించారు. మార్చి నెలాఖరులోగా ఈకేవైసీని తప్పనిసరిగా పూరించాలని కోరారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

పెద్దేముల్: పెద్దేముల్ గ్రామానికి చెందిన డాక్టర్ శంకర్ 26వ అయ్యప్ప మాలధారణ సందర్భంగా పడి పూజను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి గీతాలను ఆలపించారు. గురుస్వాములు కృష్ణ, రవి, పూరుగూర్తి నర్సింహారెడ్డి సమక్షంలో పడి పూజను జరిపించారు. 41వ రోజు దీక్ష పూర్తి చేసుకొని, కేరళలోని మణికంఠుడికి ఇరుముడి సమర్పిస్తామని అయ్యప్ప భక్తుడు కృష్ణ పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

స్పీకర్‌ను కలిసిన నేతలు



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ప్రభాకర్ శనివారం నగరంలోని స్పీకర్ జి. ప్రసాద్‌కుమార్‌ను వికారాబాద్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్, ధారూర్ మాజీ జెడ్పీటీసీ రాములతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సభాపతిగా రాణించి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో న్యాయవాది గోపాల్‌రెడ్డి, నాగసముందర్ మాజీ ఎంపీటీసీ బాలయ్య తదితరులు ఉన్నారు.

3,792 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

పెద్దేముల్: తాండూరు డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మండల పరిధి మంబాపూర్, జనగాం, మన్‌సాన్‌పల్లి వరి కొనుగోలు కేంద్రాల్లో శనివారం నాటికి 52 మంది రైతుల నుంచి 3,792 క్వింటాళ్ల (9,482 బస్తాల) ధాన్యం కొనుగోలు చేశామని సెంటర్ ఇన్‌చార్జి నజీర్ తెలిపారు. రైతులకు గోనెసంచులు కొరత లేకుండా చేశామని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. తూకం అయిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు చేరవేస్తున్నామని స్పష్టంచేశారు.

ఆపద వస్తే 100కు డయల్ చేయండి

తాండూరు రూరల్: ఆపద సమయంలో 100కు డయల్ చేయాలని సీఐ రాంబాబు అన్నారు. శనివారం మండల పరిధి ఐనెల్లి శివారు తెలంగాణ ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన షీటీం అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినులు, విద్యార్థులు సోదరభావంతో మెలగాలని సూచించారు. అనవసరమైన విషయాల్లో జోక్యం చేసుకుని భవిష్యత్‌ను ఆగం చేసుకోవద్దని చెప్పారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారి గురించి ఏ మాత్రం అనుమానం, ఏదైనా ఆపద వచ్చినా 100కు డయల్ చేయాలని కోరారు. ఫోన్ చేసిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. కార్యక్రమంలో కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, షీటీం ఇన్‌చార్జి శేఖర్, హెచ్ఎం ప్రకాష్ గౌడ్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సీఐ రాంబాబు, షీటీం బృందం

పార్టీ బలోపేతానికి కృషి

ధారూరు: బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు. ధారూరు మండలం మున్నూరు సోమారం గ్రామంలో శనివారం పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం పనిచేయాలని సూచించారు. గ్రామాలు, తండాల్లో ప్రజా సమస్యలను గుర్తించి, పరిష్కారానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బిచ్చన్న, రాములు, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

జాతీయ స్థాయిలో రాణించాలి



విద్యార్థులను సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

తాండూరు టౌన్: పట్టణంలోని అక్షర కాన్సెప్ట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సందీప్, వర్ష, అనిరుధ్ తయారు చేసిన మొబైల్ మైక్రోస్కోప్ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈ సందర్భంగా మార్వాడీ యువమంచ్, బచ్పన్ వెల్ఫేర్ ట్రస్ట్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్, ప్రైవేటు స్కూల్ అసోసియేషన్, అనిల్ రాథోడ్ యువసేన, క్రిస్టియన్ మెథడిస్ట్ చర్చి ఆధ్వర్యంలో విద్యార్థులను శనివారం ఘనంగా సన్మానించారు. జాతీయ స్థాయిలో బహుమతి సాధించి తాండూరు పేరును నలుదిశలా వ్యాపింపజేయాలని కోరారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు తయారుచేసిన ఎగ్జిబిట్ జాతీయ స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. జాతీయ స్థాయిలో సైతం బహుమతి సాధించాలని వారు కోరారు. అనంతరం పాఠశాలలో రెడ్ కలర్స్ డే, సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

రోడ్డు పరిశీలన

కొడంగల్ రూరల్: పట్టణంలోని జాతీయ రహదారి నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లే సీసీ రోడ్డును అధికారులు శనివారం పరిశీలించారు. రోడ్డును పూర్తిగా తొలగించాలా, మరమ్మతులు చేపట్టాలా అనే విషయంపై ఉన్నతాధికారులకు వివరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏఈ రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పీఆర్ఏఈ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

సిరులు కురిపిస్తున్న విరులసాగు

- తక్కువ పెట్టుబడితో.. అధిక లాభం
- ఆసక్తి చూపుతున్న రైతులు
- ప్రస్తుత సీజన్‌లో పూలకు భారీ డిమాండ్

కుల్కచర్ల: తక్కువ విస్తీర్ణం, అంతే పెట్టుబడితో పూలసాగు లాభాల పంట పండిస్తోంది. చిన్నసన్నకారు రైతులు తమకున్న ఎకరా, అరెకరా స్థలంలో సాగు చేస్తూ.. మంచి ఫలితాలు పొందుతున్నారు. కాగా.. ప్రత్యామ్నాయ పంటల్లో భాగంగా ఈ పంట రైతులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పండుగల సీజన్‌లో పూలకు డిమాండ్ ఉండటంతో ఆదాయం బాగానే వస్తుందని వివరించారు.

పండుగల పూట..

ప్రస్తుతం అయ్యప్ప, శివ భక్తుల పూజలు, సంక్రాంతి, నూతన సంవత్సరం, గృహప్రవేశాలు, వివాహాలు తదితర శుభకార్యక్రమాల నేపథ్యంలో పూలకు (మిగతా రోజుల కంటే) డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఈ సందర్భంగా సాగు చేసిన వారితో పాటు, వ్యాపారులకు ఆశించిన స్థాయిలో లాభం దక్కనుంది. కాగా.. కుల్కచర్ల మండలం కాళమ్మ, అంతారం, ఇప్పాయిపల్లి, చౌడాపూర్ గ్రామాల్లో రైతులు అధికంగా పూలసాగు చేస్తున్నారు. ఇతర పంటల కంటే.. పూలను నమ్ముకున్న వారు మంచి లాభాలు పొందుతున్నారని పలువురు అన్నదాతలు చెప్పారు.



పూలసాగును పరిశీలిస్తున్న రైతు

తక్కువ ఖర్చుతోనే

వరి, ఇతర ఏ పంటలు పండించాలన్నా.. అధిక పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. పొలాలను అచ్చుకట్టడం, దున్నడం, విత్తు విత్తడం, ఎరువులు, పురుగు మందులతో పాటు పని ఎక్కువగానే ఉంటుంది. కానీ పూల సాగుకు అంత శ్రమించాల్సిన అవసరం లేదని ఇప్పటికే సాగు చేస్తున్న రైతులు చెప్పారు. తక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకోవచ్చని, తక్కువ పెట్టుబడితో ముందుకు వెళ్లొచ్చని స్పష్టం చేస్తున్నారు. సాగుకు ఏదైనా వింత తెగుళ్లు సోకితే తప్ప.. పెద్దగా నష్టాలు రావని పేర్కొంటున్నారు. అందుకు అన్నిసాగుల్లో.. పూల సాగుతో లాభాలు మెండుగా ఉండటంతో.. రైతులు పూలవైపే మొగ్గుచూపడం గమనార్హం.

సీజన్లలో లాభాలు మెండు

పూలసాగు వలన పెద్దగా ఇబ్బందులు ఉండవు. తక్కువ విస్తీర్ణంలో, తక్కువ ఖర్చుతో సాగు చేయవచ్చు. సీజన్లలో డిమాండ్ బాగా ఉంటుంది. లాభాలు అదే విధంగా వస్తాయి. స్థానికంగా గిరాకీ లేని పక్షంలో పరిగి, మహబూబ్‌నగర్ మార్కెట్లకు తరలించి విక్రయిస్తాము. దూర ప్రాంతాలకు వెళ్లి, మార్కెటింగ్ చేసుకోవడానికి ప్రభుత్వాలు మరింత ప్రోత్సహిస్తే బాగుంటుంది.

– వెంకటయ్య గౌడ్, పూల రైతు, ఇప్పాయిపల్లి

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

కొడంగల్ రూరల్: మండల పరిధి గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను ఆ శాఖ అధికారులు పరిష్కరించారు. రంగారెడ్డి జోన్ సీజీఎం ఆనంద్ ఆధ్వర్యంలో శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, తీగలు వేలాడుతున్న ప్రదేశాల్లో అదనపు స్తంభాలను అమర్చారు. ఈ సందర్భంగా ఏడీఈ నవీన్‌కుమార్ మాట్లాడారు. విద్యుత్ సమస్యలు ఉంటే కొడంగల్‌లోని వినియోగదారుల సేవా కేంద్రంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. వీలైనంత త్వరలో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వేతనాలు ఇప్పించండి..

అనంతగిరి: ఎనిమిది నెలలుగా గౌరవ వేతనం రాక ఇబ్బంది పడుతున్నామని, వెంటనే జీతాలు ఇప్పించాలని వీఓఏల జిల్లా సంఘం జిల్లా ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. పండుగలు వస్తున్నందున జీతాలతో పాటు, సెర్ప్ నుంచి గుర్తింపు కార్డులు ఇప్పించాలని పేర్కొన్నారు.

శ్రీరామ జన్మభూమి అక్షింతల వితరణ

పరిగి: గడపగడపకూ రామచంద్రమూర్తి అక్షింతలు అందజేస్తామని విశ్వహిందుపరిషత్ సభ్యులు ప్రకటించారు. అయోధ్య నుంచి శ్రీరామమూర్తి అక్షింతలు పట్టణ కేంద్రంలోని శివాలయానికి రావడంతో శనివారం వితరణ చేశారు. శివాలయం నుంచి బహార్‌పేట్ హనుమాన్ ఆలయానికి ఊరేగింపుగా కలశాలను తీసుకెళ్లి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు మారుతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

విద్యార్థి దశ ఎంతో కీలకం

మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్



మాట్లాడుతున్న మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్

కొడంగల్ రూరల్: విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు ఎదగాలని మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్ సూచించారు. మండల పరిధి టేకుల్‌కోడ్, అన్నారం గ్రామాల్లో న్యాయ విజ్ఞాన వేదిక సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం రూపొందించిన చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రైతును సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటయ్య, సీనియర్ న్యాయవాదులు ఆనంద్, బస్వరాజ్, న్యాయవాదులు రాములు, రమేశ్, రవీందర్‌నాయక్, కోర్టు సిబ్బంది ఉన్నారు.